క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీగణపతి కల్యాణోత్సవం



ఉత్సవమూర్తులను కాలనీ వీధుల్లో ఊరేగిస్తున్న నిర్వాహకులు

మీర్‌పేట: మీర్‌పేట శివసాయినగర్ కాలనీలోని శ్రీగౌరీ నీలకంఠేశ్వరస్వామి సమేత శ్రీలక్ష్మీగణపతి దేవాలయ 12వ వార్షికోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు శ్రీ సిద్ధి బుద్ధి సమేత లక్ష్మీ గణపతి కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను కాలనీ పురవీధుల్లో ఊరేగించి కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. అనంతరం కల్యాణం నిర్వహించారు. పూజల్లో ఆలయ చైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి, సభ్యులు సంతోష్‌రెడ్డి, అన్నాజీరావు, వెంకటరమణ, వెంకట కృష్ణారావు, రామచంద్రారెడ్డి, కాలనీ అధ్యక్షుడు పుష్పశ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని వినతి



చల్లా నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మీర్‌పేట: అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ మీర్‌పేట కార్పొరేషన్ నందిహిల్స్ కాలనీవాసులు శనివారం టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలనీలో భూగర్భ డ్రైనేజీ, రోడ్లు, పార్కులు పూర్తిస్థాయిలో అభివృద్ధి కాలేదని, పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేయించాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. దీనికి చల్లా స్పందిస్తూ కాలనీ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏడుదొడ్ల సురేందర్‌రెడ్డి, నందిహిల్స్ ఫేజ్–1 అధ్యక్షుడు చల్లా సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, ఫేజ్–2 అధ్యక్షుడు ఆనందం, రవీందర్‌నాయక్, సురేష్, సూర్యనారాయణ, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల నిర్మాణం పూర్తిచేయాలని వినతి



ఆకునూరి మురళికి వినతిపత్రం ఇస్తున్న మాజీ మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: బడంగ్‌పేట్‌లో అర్ధంతరంగా ఆగిపోయిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత నర్సింహారెడ్డి శనివారం తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పారిజాత మాట్లాడుతూ.. బడంగ్‌పేట్ చౌరస్తాలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను విద్యార్థులకు సౌకర్యంగా ఉండాలని దావుత్‌ఖాన్‌గూడలో కొత్త పాఠశాల నిర్మాణం చేపట్టారు. ఏడాదిన్నర కాలంగా నిర్మాణ పనులు నిలిచిపోయినట్లు గుర్తుచేశారు. ఈ అకాడమిక్‌లోగా అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తిచేసి నూతన భవనంలో విద్యార్థులు సకల సౌకర్యాలతో విద్యనభ్యసించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో విద్యాకమిషన్ సభ్యులు జ్యోత్స్న, శివారెడ్డి ఉన్నారు.

ఫిట్‌నెస్ లేని వాహనాలపై చర్యలు

నాగోలు: ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులు ఫిట్‌నెస్ ఉండాలని రవాణాశాఖ అధికారులు సూచిస్తున్నారు. రాష్ట్ర జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, కార్యదర్శి సి రమేష్ ఆదేశాల మేరకు శనివారం మలక్‌పేట ఆర్టీఓ ఎల్. కిష్టయ్య ఆధ్వర్యంలో నాగోలులోని ఈస్ట్ జోన్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల వాహనాల డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ కిష్టయ్య మాట్లాడుతూ.. ఫిట్‌నెస్ లేకుండా వాహనాలను నడిపేతే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనం నడుపుతున్నప్పుడు ఫోన్‌లో మాట్లాడరాదన్నారు. ఈ కార్యక్రమంలో బలరాం, రమేష్‌బాబు, నరేందర్, పాల్‌సింగ్, రాధిక పాల్గొన్నారు.

యమపాశాలు!

- కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు
- మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- నిర్లక్ష్యం వీడని విద్యుత్ అధికారులు

తుక్కుగూడ: మూగజీవాల పాలిట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు యమపాశాలుగా మారుతున్నాయి. గృహాలు, పొలాల మధ్యన ఉన్న నియంత్రికలకు రక్షణగా ఎలాంటి కంచె ఏర్పాటు చేయక పోవడంతో పశువులు మృత్యువాత పడుతున్నాయి. దిమ్మెల ఎత్తు తక్కువగా ఉండటం, ఎర్తు వైర్లు తేలి ఉండటంతో మేత కోసం వెళ్లిన జీవాలు విద్యుదాఘాతానికి బలవుతున్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

తరచుగా ప్రమాదాలు

తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధి తుక్కుగూడ, రావిర్యాల, మంఖాల్, ఇమామ్‌గూడ, సర్దార్‌నగర్ గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు ఎలాంటి రక్షణ లేదు. దీనికి తోడు ఇవి తక్కువ ఎత్తులో ఉండటం మూలంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పాడిపశువులు, కాడెద్దులు, మేకలు, గొర్రెలు మృత్యువాత పడుతున్నాయి. గడిచిన ఐదేళ్లలో 10 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అవి ఇలా ఉన్నాయి. రెండేళ్ల క్రితం రావిర్యాల గ్రామానికి చెందిన ఓ రైతు పాడి ఆవు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. మంఖాల్ గ్రామానికి చెందిన ఓ రైతు పశువు మూడేళ్ల క్రితం మేతకు వెళ్లి మృత్యువాత పడింది. సర్దార్‌నగర్ గ్రామానికి చెందిన ఓ రైతు మేక.. మేతమేస్తూ.. పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ తీగ తగిలి విగతజీవిగా మారింది.



రావిర్యాలలో మృత్యువాత పడిన పాడి ఆవుతో రైతు(ఫైల్)

అందని పరిహారం

విద్యుదాఘాతంతో పశువులు మృత్యువాత పడుతున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కరెంట్ షాక్‌తో మూగజీవాలు మృతి చెందితే.. వాటి యజమానికి విద్యుత్ శాఖ తగిన పరిహారం అందించాలి. కానీ ఏళ్లు గడుస్తున్నా బాధిత రైతులకు ఎలాంటి పరిహారం చెల్లించడం లేదు. ఇందుకు కారణం అధికారులు కొర్రీలు పెట్టడమేనని పలువురు ఆరోపిస్తున్నారు.



తుక్కుగూడలో గృహాల మధ్య ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాదరణ చూసి ఓర్వలేకే విమర్శలు

బడంగ్‌పేట్: కాంగ్రెస్ పార్టీకి ప్రజల వద్ద నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు పార్టీ నేతలపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని సీనియర్ నాయకులు అన్నారు. శనివారం బడంగ్‌పేటలో కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ సభ్యుడు బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు నవారు మల్లారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు కబ్జాలు, బెదిరింపులకు పాల్పడి కోట్లు వెనకేసుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌కు మైలేజీ పెరుగుతుంటే తట్టుకోలేక బీఆర్ఎస్ కార్పొరేషన్ల అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, కామేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కలిసి కాంగ్రెస్‌ను విమర్శించడం పనిగా పెట్టుకున్నారన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరి పార్టీ ప్రతిష్టలు నష్టపరిచే మీరా కేఎల్ఆర్‌పై విమర్శలు చేసేది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరి మెప్పుకోసం భజనలు చేసే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌ను విమర్శిస్తారా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తారన్నారు. కేఎల్ఆర్‌ను విమర్శిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్, ఉపాధ్యక్షులు క్యారగారి శ్రీధర్, శ్రీనివాస్‌గౌడ్, బి.జంగయ్య, సుధాకర్‌రెడ్డి, బాలకృష్ణ, కుమార్, సామ వరుణ్‌రెడ్డి, చంద్రపాల్‌రెడ్డి, టి.భానుప్రసాద్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలి

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరులో శనివారం పంచాయతీ కార్యదర్శి రాజేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన 111 మంది లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి నిర్మాణాలు చేసుకోవాలని అప్పుడు మాత్రమే బిల్లులు మంజూరవుతాయని ఆయన వారికి వివరించారు. 400 అడుగుల నుంచి 600 అడుగుల విస్తీర్ణంలోపు మాత్రమే నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. అదనంగా నిర్మిస్తే ఆన్‌లైన్‌లో నమోదు కాదన్నారు. దీంతో నగదు కూడా రాదని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, కమిటీ సభ్యులు ఏ.బాలయ్య, జి.సంజీవరెడ్డి, వి.మంజుల, ఎన్.నాగరాజు, నాయకులు బొర్ర సురేష్, ఎండీ పర్వేజ్, వి.బాబు, ఏ.దర్శన్, ఎండీ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి రాజేశ్‌గౌడ్

కాంగ్రెస్‌ను విమర్శించడం సరికాదు

- వైఎస్సార్ హయాంలో అభివృద్ధి చెందిన మహేశ్వరం
- వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య

మహేశ్వరం: కన్న తల్లిలాంటి కాంగ్రెస్ పార్టీని మోసం చేసి, అధికార దాహంతో మంత్రి పదవి కోసం బీఆర్ఎస్ పార్టీలో చేరిన సబితారెడ్డి కాంగ్రెస్‌ను విమర్శించే హక్కులేదని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్‌ముదిరాజ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వత్తుల రఘుపతి కాంప్లెక్స్‌లో సమావేశంలో ఇరువురు మాట్లాడారు. 2009లో దివంగత నేత డా.వైస్.రాజశేఖర్‌రెడ్డి.. సబితారెడ్డిని చేవెళ్ల నుంచి మహేశ్వరం తీసుకొచ్చి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయించి, మంత్రి పదవి ఇచ్చారని గుర్తుచేశారు. 2019లో కాంగ్రెస్ నేత దేప భాస్కర్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యేగా గెలిచిన విషయం మరవొద్దని చెప్పారు. మహేశ్వరం నియోజకవర్గం.. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రులు వైఎస్సార్, రోశయ్య, కిరణ్ కుమార్‌రెడ్డి హయాంలోనే అభివృద్ధి చెందిందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే హోదాలో ఉండి ప్రజలు, లబ్ధిదారులను తులం బంగారం, స్కూటీలు సీఎం ఎప్పుడిస్తారని పదే పదే మాట్లాడి రెచ్చగొట్టి ప్రభుత్వాన్ని బదనాం చేయడం తగదన్నారు. మహేశ్వరం ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గానికి ఎన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశారో ప్రజలకు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధి చేసే బాధ్యత మీకు లేదా సబితారెడ్డిని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ ప్రత్యేక చొరవతో కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, 200ల యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సబ్సిడీ, రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నబియ్యం, రాజీవ్ యువ వికాస్ కింద రుణాలతో పలు సంక్షేమ పథకాలను ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మహేశ్వరం నియోజకవర్గంలో సబితారెడ్డి అనుచరులు భూకబ్జాలు, స్కాములు, దౌర్జన్యాలు చేసి అమాయక రైతులను మోసం చేశారని విమర్శించారు. ఎన్నికలకు ముందు నిధులు లేకున్న ఓట్ల కోసం శిలఫలకాలు వేసి మురిపించారని ఎద్దేవా చేశారు. అర్హత కలిగిన వారికి డబుల్ బెడ్రూంలు, దళిత బంధు ఇవ్వకుండా బీఆర్ఎస్ నాయకులకే ఇచ్చారని విమర్శించారు. మంత్రిగా పనిచేసి అవగాహన లేకుండా అధికారిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే హోదాలో ప్రభుత్వంపై నిందలు, విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇక నుంచి కాంగ్రెస్ నాయకుల జోలికి వస్తే ఊరుకోమని హెచ్చరించారు. రాష్ట్ర ఎస్సీసెల్ కన్వీనర్ నందిగామ నర్సింహ, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు నడికూడ శివ, శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, పార్టీ సీనియర్ నాయకులు ఆవుల యాదయ్య, బాల్‌రాజ్, లాజర్, సుభాష్, నర్సింహాగౌడ్, ప్రవీణ్, ఇర్షాద్, గొల్లూరు రాజు, భాస్కర్ గౌడ్, శ్రీశైలం, జంగయ్య, భిక్షపతి, జావీద్, పాండు, హరి పలువురు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలి



కార్పొరేషన్ ప్రత్యేకాధికారికి వినతిపత్రం ఇస్తున్న శంకర్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ 17వ డివిజన్‌లో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించేలా చూడాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి కార్పొరేషన్ ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలాపూర్‌లోని సాయిహోమ్స్ కాలనీవాసులు డ్రైనేజీ, వర్షపు నీటితో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇళ్లల్లోకి మురుగునీరు చేరుతున్నాయన్నారు. వర్షపునీరు ఇళ్లల్లోకి చేరి వస్తువులు తడిసి ముద్దవుతున్నాయన్నారు. డ్రైనేజీ వాసనకు ఇళ్లల్లో ఉండలేకపోతున్నారని తెలిపారు. మురుగునీరు సాఫీగా సాగేందుకు చర్యలు తీసుకొని సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్, నారాయణ, కాలనీవాసులు ఉన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా..

మంచాల: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందించడంలో భాగస్వామ్యం కావాలని ఎంపీడీఓ బాల శంకర్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదరికం నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. నిబంధనల ప్రకారం రాజీవ్‌యువ వికాసం, ఇందిరమ్మఇండ్లు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకాలను ప్రజలకు అందించాలని సూచించారు.

3 రవాణా వ్యవస్థల అడ్డా.. నల్గొండ చౌరస్తా!

- ఆకట్టుకునే కళాకృతులు
- సమీపంలోనే ప్రముఖ మార్కెట్, రైల్వే స్టేషన్, ప్రభుత్వాసుపత్రి



ట్రాఫిక్ జాంతో నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారి



మూడు రవాణా వ్యవస్థల కూడలిగా నల్గొండ

చాదర్‌ఘాట్: నగర ప్రజలకు పరిచయం అవసరం లేని ప్రాంతం నల్గొండ చౌరస్తా. నగరం నుంచి శివారు ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు వెళ్లాలంటే నల్గొండ చౌరస్తా మీదుగానే వెళ్లాలి. నిత్యం అత్యంత రద్దీగా ఉండే ఈ చౌరస్తా పరిసరాల్లో పేరొందిన కార్యాలయాలు, పార్కులు, పురాతన కట్టడాలు ఉండటమే కాకుండా భిన్న ప్రాముఖ్యతలు ఉన్న అరుదైన మూడు రవాణా వ్యవస్థల చౌరస్తాగా రూపాంతరం చెందింది. గతంలో నల్గొండ చౌరస్తా అత్యంత రద్దీగా ఉండేది. ఇక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఫ్లై ఓవర్ నిర్మించి ఆయన చేతుల మీదుగానే ప్రారంభించారు. అనంతరం నగరంలో మెట్రో రైలు కోసం ఇక్కడి ఫ్లై ఓవర్ పై నుంచి మెట్రో నిర్మాణం జరిగింది. కింద ప్రధాన రహదారి, దానిపై ఫ్లై ఓవర్, ఆపైన మెట్రో నిర్మాణంతో ఈ చౌరస్తాలో మూడు రవాణ వ్యవస్థలకు అడ్డాగా మారింది.

- నల్గొండ చౌరస్తా సుందరీకరణ పనుల్లో భాగంగా ఇక్కడ ఏర్పాటు చేసిన కళాకృతులు రహదారి గుండా ప్రయాణించే వారిని ఆకట్టుకుంటాయి.
- ఇక్కడ ఫ్లై ఓవర్ కింది భాగంలోనే ఆహ్లాదం అందించే జాతీయ వికలాంగుల పార్కును ఏర్పాటు చేశారు.
- ఇక్కడికి సమీపంలోనే మలక్‌పేట రైల్వే స్టేషన్ ఉంది.
- చౌరస్తాకు అత్యంత సమీపంలోనే మలక్‌పేట ఏరియా ఆసుపత్రి ఉంది.
- నగరంలోనే అతి పెద్ద మార్కెట్లలో ఒకటైన మలక్‌పేట మార్కెట్ చౌరస్తాకు ఆనుకొని ఉంటుంది.
- మార్కెట్‌కు వెనుక వైపు నిజాం కాలంలో నిర్మించిన మహబూబ్ మాన్షన్ ఉంటుంది. మాన్షన్‌కు వెళ్లే మార్గంలో అప్పటి దర్వాజాలు, మరి కొన్ని పురాతన నిర్మాణాలు అటుగా వెళ్లే వారికి ఇట్టే ఆకర్షిస్తాయి.



చౌరస్తాలోని వికలాంగుల జాతీయ పార్కు



చౌరస్తా సమీపంలోని మలక్‌పేట మార్కెట్

విజేతలకు బహుమతుల అందజేత

కందుకూరు: మండల పరిధిలోని బైరాగిగూడలో బీపీఎల్ సీజన్–3 పేరుతో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో విజేతలకు నిర్వాహకులు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఎస్ఆర్‌హెచ్ జట్టుకు గ్రామానికి చెందిన సయ్యద్ ఇమ్రాన్ రూ.15వేల నగదుతో పాటు షీల్డ్ అందించారు. ద్వితీయ స్థానంలో నిలిచిన ముంబై ఇండియన్ జట్టుకు పల్స వెంకటేశ్‌గౌడ్ రూ.10వేల నగదుతో పాటు షీల్డ్ అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, యువకులు పి.బాబు, జి.బాబు, పి.కృష్ణ, పి.శివ, జి.నర్సింహ, పి.నాగార్జున, జి.భగవంతు, ఎం.సోనూ, ఏ.బెనర్జీ, జి.కిరణ్, పి.శ్రీనాథ్, కె.శ్రీకాంత్, వై.సందీప్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో నిర్వాహకులు